# సిద్ధాంతనగర్ కాలనీ

9

## గుడిశెల రాజకీయం

మా కాలనీలో వుండే మిమిక్రీ ఆర్టిస్ట్ మారుతీ ప్రసాద్ సొంతిల్లు కట్టుకుని గృహ ప్రవేశం చేయబోతు న్నాడన్న వార్త అశనిపాతంలా తాకింది మమ్మల్ని.

ఆ సాయంత్రం అందరం కాలనీ వేదిక దగ్గర కూర్చుని ఆ విషయమే బరువెక్కిన హృదయాలతో మాట్లాడు కుంటూంటే మారుతీ ప్రసాద్ చిరునవ్వుతో వెలిగి పోతున్నముఖంతో మాదగ్గర కొచ్చాడు.



"రేపే తెల్లారుఝామునే గృహప్రవేశం సార్! మన కాలనీ వాళ్ళంతా తప్పకుండా రావాలి!" అన్నాడు అందరికీ తలో ఇన్విటేషన్ కార్డు ఇస్తూ.

ఆ ఇన్విటేషన్ కార్డు చూస్తూనే మాకందరికీ మాట పడిపోయినంత పనయింది.

"తప్పకుండా వస్తాం" అన్నాం లోపలి ఫీలింగ్స్ బయటకు కనిపించకుండా అణచిపెడుతూ.

అతను వెళ్ళిపోయిన చాలసేపటి వరకు అందరం నిశ్శబ్దంగా వుండిపోయాం.

"అందరూ ఇళ్ళు కట్టుకుంటున్నారు. మనకే - స్థలం వుండీ - లేకుండా పోయినట్లయింది" అన్నాడు శాయిరావ్.

"లేకపోతే ఈ పాటికి మనందరం కూడా గృహ ప్రవేశాలు చేసి వుండేవాళ్ళం" అన్నాడు రంగారెడ్డి విచారంగా.

ఆ రాత్రి ఆ మారుతీప్రసాద్ గృహ ప్రవేశం తాలూకూ ఇన్విటేషన్ కార్డు చూసేసరికి కాలనీలో ఆడాళ్ళందరూ సాధింపు ప్రారంభించినట్టు స్పష్టంగా వినిపిస్తూనే వుంది బయటకు.

"ఇంత చేతకాని వాళ్ళు కాబట్టే కొన్న ప్లాట్లను ఆ గుడిశెల వాళ్ళకు అప్పజెప్పి నోర్మూసుక్కూర్చున్నారు" అంటుందొకావిడ.

"మా పుట్టింటి వాళ్ళిచ్చిన డబ్బు మాకు తెచ్చిచ్చే యండి. ఇల్లు కట్టని కాడికి ఆ ప్లాట్లుండేం లాభం?" అంటోందింకోఆవిడ.

వాళ్ళ సూటి పోటీ మాటలు భరించలేక భోజనా లవగానే అందరం ఇళ్ళల్లో నుంచి బయటపడ్డాం.

"ఎట్లాగయినా మన ప్లాట్లు మనం స్వాధీనం చేసు కోవాలి!" అన్నాడు గోపాల్రావ్ ఆవేశంగా. అతని మాటతో మా అందరికీ కూడా ధైర్యం, ఆవేశం పుట్టు కొచ్చినయ్.

"అవును! అదంతా మన కష్టార్జితం కనుక వదలడానికి వీల్లేదు" అన్నాడు రంగారెడ్డి.

"కానీ ఎలా స్వాధీనం చేసుకుంటాం! పోలీసులు మనకే మాత్రం సహాయం చేయడం లేదు కదా! పైపెచ్చు గుడిసెలను తీసేస్తామని మన డబ్బు కూడా

యర్రంశెట్టి శాయి

కొట్టేశారు" అన్నాడు చంద్రకాంత్ అనుమానంగా.

దాంతో మా ఆవేశాలు మళ్ళీ చల్లారి పోయాయ్.

"పోలీసులు సహాయం చేయకపోతే వాళ్ళపై అధికారులకు రిపోర్టిద్దాం" అన్నాడు గోపాల్రావ్.

అతని సూచన మాకందరికీ నచ్చింది.

పోలీస్ అధికారుల్లో కూడా అవినీతి వున్నా డైరెక్ట్‌గా వచ్చే కొత్త ఐపిఎస్ అధికారులు కనీసం కొంత కాలం వరకయినా చాలా సిన్సియర్‌గా, నీతిగా వుంటారని మాకు తెలుసు. అందుకని వాళ్ళను బతిమాలుకుంటే ఫలితం వుండవచ్చని మాకనిపించింది.

మర్నాడే అందరం కలిసి పోలీస్ అధికారులను కలుసుకోవాలని నిర్ణయించుకున్నాం.

"కొంత మంది పోలీస్ అధికారులు నాకు బాగా తెలుసు. వాళ్ళు మామూలు పౌరులకు సహాయం చేయకపోవచ్చు గానీ మా జర్నలిస్ట్‌లకు మంచి సహాయం చేస్తారు" అన్నాడు గోపాల్రావ్.

తీరా మర్నాడు మేము వెళ్ళేసరికి పోలీస్ అధికారులంతా నక్సలైట్లు పట్టుకున్న ఓ మండలాధికారిని విడిపించే విషయంలో చాలా బిజీగా వున్నారని తెలిసింది.

సాయంత్రం ఆరు గంటల వరకూ వేచి వున్నాక మాకు ఇంటర్వ్యూ దొరికింది.

మా సంగతంతా చాలా ఆసక్తిగా విని మా అర్జీ తీసుకున్నాడతను.

"నేను చూస్తాను! మీరింక వెళ్ళి రండి" అన్నాడు చివర్లో.

మేము ఆనందంగా తిరిగి వచ్చేశాము.

మర్నాడే పోలీసులు వెళ్ళి ఆ గుడిశెలన్నిటినీ పీకేస్తారని మేమనుకున్నాం గానీ నెల రోజులయినా ఏమీ జరక్కపోయేసరికి మాకు తిక్క రేగి పోయింది.

అందరం కలిసి మళ్ళీ పోలీస్ స్టేషన్‌కెళ్ళాం.

ఇన్‌స్పెక్టర్ మమ్మల్ని చూసి నవ్వాడు.

"కుదరదయ్యా వాళ్ళ గుడిశెలు తీయడం కుదరదని చెప్పినా వినకుండా మా ఆఫీసర్ దగ్గర కెళ్ళారు కదా! ఆయనేం చేస్తాడు? మాకు చెప్పాల్సిందేగా మళ్ళీ?"

మా ముఖాలు మాడిపోయాయి.

"వాటిని పీకేయడం ఎందుకు కుదరదు? మీకు ఇచ్చిన డబ్బు చాల్లేదా?" కోపంగా అడిగాడు రంగారెడ్డి.

"అది కాదయ్యా! మన రాజధానిలో వుంటూ కూడా గుడిశెల రాజకీయం గురించి మీకు తెలీలేదంటే ఏం చెప్పాలి? మీ స్థలాల్లో గుడిశెలు వేయించింది ఎవరో కాదు. ఆ ఏరియా ఎం.ఎల్యే. ఆ ఏరియాలో వాళ్ళ పార్టీకి ఓట్లుకొంచెం తక్కువయ్యాయని గుడిశెలేయించి వాళ్ళ పార్టీ వాళ్ళను అందులో వుంచారు. కనుక వాళ్ళను ఖాళీ చేయించడం ఎవడివల్లా కాదు-"

మేము గొణుక్కుంటూ ఇళ్ళకు చేరుకున్నాం.

ఆ రాత్రి ఎవరికీ నిద్రపట్టలేదు.

ఆ స్థలాలకు తిలోదకాలు వదులుకోవాల్సి వచ్చిందే అనే బాధ.

తెల్లారుజామున నాలుగ్గంటలకు కాలనీలో గోపాల్రావ్ వుంటున్న వేపు నుంచే పెద్దగా కేక వినిపించేసరికి అందరం అదిరిపడి లేచి కూర్చున్నాం.

మరి కాసేపట్లో బిగరగా మాటలు వినిపించే సరికి వుండబట్టలేక బయటకు నడిచాను. అప్పటికే మా వాళ్ళందరూ నిద్ర కళ్ళతో గోపాల్రావ్ చుట్టూ మూగి వున్నారు.

'గోపాల్రావ్ చాలా ఉత్సాహంగా మాట్లాడుతున్నాడు.

"రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాను గురూ! కొన్నాళ్ళ అవర్ స్వెట్ అండ్ బ్లడ్ కదా!ఎలా వదులుకుంటాం? చివరకు మార్నింగ్ ఫోర్‌ఓక్లాక్‌కి అయిడియా వచ్చింది!

"ఏమిటది?"

"మనందరం కలిసి కోర్టు కెళ్దాం! ఇది అనేక మందికి సంబంధించిన కేస్ కాబట్టి త్వరగా న్యాయం జరగడానికి అవకాశం వుంది. ఇలాంటి కేసుల్లో మాంచి స్పెషలిస్ట్ లాయర్ ఒకతను నాకు బాగా తెలుసు. అతని దగ్గరకెళ్దాం -" అన్నాడతను ఉత్సాహంగా.

మాకూ అతని మాటలు ఆశలు కలిగించినయ్.

అప్పటికప్పుడే రెడీ అయి ఉదయం ఆరు గంటల కల్లా లాయర్ నరసింహారావ్ ఇంటికి చేరుకున్నాం.

గోపాల్రావ్‌ని చూస్తూనే ఆదరంగా ఆహ్వానించాడతను.

"వీళ్ళంతా మీ కాలనీ వాళ్ళేనా?" అడిగాడతను.

"అవును!"

"గుడ్ ఫెలోస్! పేపర్లో పాపం - మీ పాట్లు అప్పుడప్పుడూ చూస్తూనేవుంటాను. ఇంతకూ ఏం పని మీద వచ్చారు?"

గోపాల్రావ్ జరిగిందంతా చెప్పాడు.

అతనికి మా మీద జాలి వేసింది.

"దిసీజ్ టూమచ్! మన రాష్ట్రంలోనే కాదు. దేశమంతా కూడా పరిస్థితి ఇలాగే అఘోరించింది. మధ్య తరగతి వాడి గురించి పట్టించుకునే నాథుడే లేడు. గవర్నమెంట్ దృష్టిలో ప్రజలంటే మందలు మందలుగా ఓట్లు నివసించే ప్రాంతాలు! అంతే!"

"ఇప్పుడు మనం కోర్టుకెక్కితే వాళ్ళను మా స్థలాల్లో నుంచి ఖాళీ చేయిస్తారంటారా?" ఆశగా అడిగాడు శాయిరావ్.

"ఇంతమందికి అన్యాయం జరిగింది గనుక తప్పక మనకు అనుకూలంగా తీర్పులభించే అవకాశాలున్నాయ్"

మా మహజర్లు, డాక్యుమెంట్లు, పోలీస్ కంప్లైట్ల కాపీలు అన్నీ జతపరచి ఆయనకిచ్చాము.

ఆరు నెలల తరువాత మా నరసింహారావ్ వ్యక్తిగత పలుకుబడివల్ల మా కేసు హియరింగ్‌కొచ్చింది. అందరం కోర్టు కెళ్ళి మతగ్రంథాల మీద ప్రమాణాలు చేసి మేజిస్ట్రేట్‌గారికి జరిగిందంతా విన్నవించుకున్నాం.

ఆయనకు మా మీద విపరీతమయిన జాలి కలిగింది.

మా జనార్దన్ అద్భుతమైన నటనతో సహా తను ఎన్ని కష్టాలు పడి ఆ స్థలం కొన్నదీ వివరిస్తుంటే మేజిస్ట్రేట్ గారికి కూడా కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

ఆ మేజిస్ట్రేట్ గారు కూడా ఆ మధ్య కొన్న ఓ స్థలంలో కూడా ఎవరో గుడిశెలు వేశారనీ, అందువల్ల ఆయన మా బాధ తేలికగా అర్థం చేసుకోగలిగాడనీ తరువాత చెప్పాడు నరసింహారావ్.

**(ఇంకా వుంది)**

---



## శాయితో ముఖాముఖి

**వి. ప్రసాదరావ్, జహీరాబాద్**

భక్తుడు గుడికెళ్ళినా, భర్త ఇంటికెళ్ళినా పూలు ఫలాలు తీసుకెళ్తారు. రెంటికీ తేడా ఏమిటి?

సమర్పించుకోవటం, దోచుకోవటం!

**వి.కె. తులసి, అనకాపల్లి**

ఇళ్ళ ద్వారానికి కర్టెన్లెందుకో?

బయటివాళ్ళు మనని చూడకుండా మనం బయటి వాళ్ళను చూడ్డానికి.

**వి. రాంబాబు, తాండూర్**

మీ నిర్భయ్ నగర్ కాలనీ అసలెక్కడ?

ఆ దిక్కుమాలిన కాలనీ మన రాజధాని అవుట్ స్కర్ట్స్‌లో ఎక్కడ వెతికినా కనపడుతుంది!

**ఎ. కరుణాకర్, వైజాగ్**

మేడ్‌ఫర్ ఈచ్ అదర్ అని ఎవరిని అంటారు?

భారత ప్రభుత్వాలనూ, భారత ప్రజలనూ!

**ఎన్. ప్రకాశరావ్, విజయవాడ**

మీరు చదివిన గొప్ప జోక్ చెప్తరూ?

రచయితల గొప్పతనం గురించి వాళ్ళే రాసుకునే 'వాక్యాలూ, వాళ్ళే తగిలించుకునే బిరుదులూ!

**కె. అప్పారావ్, ఖమ్మం**

'స్వీట్ నథింగ్స్, అంటారు కదా! 'నథింగ్' స్వీట్‌గా ఎలా వుంటుంది?

భలేవారే! అది వస్త్రధారణకు సంబంధించిన విషయం. ఇప్పుడు ఒప్పుకుంటారా?

**కె. హిరణ్మయీదేవి, రాజమండ్రి**

కన్యాత్వం చెడకుండా తల్లి అయ్యేదెవరు?

క్రిస్టియన్ మిషనరీలలో సిస్టర్స్ కొంత కాలానికి 'మదర్స్' అయిపోతారు కదా!

**ఆర్. చంద్రశేఖర్, వరంగల్**

బెడ్ రూమ్ చూస్తే భార్య బేజారెత్తిపోయే దెప్పుడు?

"ఈ వేళ్ళ అద్దంగా వున్నావ్ రాధా!" అని లలిత పేరుగల భార్యను దగ్గరకు తీసుకుని ప్రేమగా అన్నప్పుడు.

**వి.ఆర్.మోహన్రావ్, తాడేపల్లిగూడెం**

'స్వీట్ సెక్స్‌టీన్' అని రాశాడో రచయిత! సెక్స్ స్వీట్‌గా వుంటుందా?

బహుశా 'ఆంగ్ల భాష' స్వీట్‌గా వుండి వుంటుంది రచయితకు.